క్లుప్తంగా

ప్రశాంతంగా ఏపీఈఏపీ సెట్

పెనమలూరు: ఆంధ్రప్రదేశ్ ఇంజినీరింగ్, అగ్రికల్చర్ అండ్ ఫార్మ కామన్ ఎంట్రన్స్ టెస్టు (ఏపీ ఈఏపీ సెట్) పరీక్ష సోమవారం మండల పరిధిలో ప్రశాంతంగా జరిగింది. కానూరులోని శైలేష్ అకాడమీ, శ్రీదుర్గా ఐటీ సొల్యూషన్ అకాడమీలో పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేశారు. మొదటి రోజు ఉదయం 9 నుంచి 12 గంటల వరకు, మధ్యాహ్నం 3 నుంచి 6 గంటల వరకు ప్రవేశ పరీక్ష జరిగింది. పరీక్ష కేంద్రాల వద్ద పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు. పరీక్షలు ఈ నెల 23వ తేదీ వరకు జరుగుతాయి. ఎంపీసీ విభాగంలో 15వ తేదీ నుంచి 19వ తేదీ వరకు, బైపీసీ విభాగంలో 22, 23 తేదీల్లో పరీక్షలు జరుగుతాయి.

కోడి పందేలు నిర్వహిస్తున్న ముగ్గురు అరెస్టు

పెనమలూరు: కోడి పందేలు నిర్వహిస్తున్న ముగ్గురు వ్యక్తులను పోలీసులు సోమవారం అరెస్టు చేశారు. పెనమలూరు పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం పెనమలూరు శివారులో కోడి పందేలు ఆడుతున్నారన్న సమాచారంతో పోలీసులు దాడులు చేశారు. కోడి పందేలు నిర్వహిస్తున్న మోతుకూరు శ్రీను, కొమ్ము శ్రీనివాసరావు, అబ్దుల్ రాహీల్‌ను అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద రూ.2900, కత్తులు, కోళ్లు స్వాధీనం చేసుకున్నారు. నిందితులపై కేసు నమోదు చేసి అరెస్టు చేశారు.

చలివేంద్రం ప్రారంభం



హనుమాన్‌జంక్షన్ రూరల్: వేసవి ఎండ తీవ్రత అధికం కావటంతో పాదచారులు, ప్రయాణికుల దాహార్తి తీర్చేందుకు ఎమ్మెల్యే వల్లభనేని వంశీ చలివేంద్రాలు ఏర్పాటు చేయటం అభినందనీయమని ఆంధ్రప్రదేశ్ నాటక అకాడమీ డైరెక్టర్ నక్కా గాంధీ అన్నారు. స్థానిక నూజివీడు రోడ్డులో ఎమ్మెల్యే వల్లభనేని వంశీ సౌజన్యంతో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని సర్పంచ్ సరిపల్లి కమలభాయి, ఎంపీపీ యర్రగొర్ల నగేష్‌తో కలిసి సోమవారం ఆయన ప్రారంభించారు. చల్లని తాగునీరు అందించేందుకు వాటర్ కూలర్‌ను ఏర్పాటు చేశారు. గ్రామంలో మరో రెండు చలివేంద్రాలు ఏర్పాటు చేసేందుకు ఎమ్మెల్యే వంశీ సంసిద్ధంగా ఉన్నారని సర్పంచ్ సరిపల్లి కమలాభాయి చెప్పారు. త్వరలోనే వాటిని ప్రారంభిస్తామన్నారు. వైఎస్సార్ సీపీ రైతు విభాగం జిల్లా అధ్యక్షుడు ఆవిర్నేని శేషగిరిరావు, వైఎస్సార్ సీపీ క్రిస్టియన్ మైనార్టీ సెల్ జిల్లా ప్రధాన కార్యదర్శి కొమరవల్లి కిరణ్ మూర్తి, జెడ్పీటీసీ సభ్యురాలు కొమరవల్లి గంగాభవాని, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు సుంకర సుభాష్‌చంద్రబోస్, మండల పరిషత్ కో ఆప్షన్ సభ్యుడు షేక్ తానీషా, పలువురు వార్డు సభ్యులు పాల్గొన్నారు.

మజ్జిగ పంపిణీ



రామవరప్పాడు : ఈ వేసవిలో పాదచారులు, ప్రయాణికుల దాహార్తిని తీర్చేందుకు నున్న గ్రామంలోని పలు సెంటర్లలో గంపా భూదేవమ్మ ట్రస్ట్ ఆధ్వర్యంలో సోమవారం మజ్జిగ పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించారు. విజయవాడ-నూజివీడు మార్గంలో పలు సెంటర్లలో పాదచారులు, ప్రయాణికులకు ట్రస్ట్ చైర్మన్ గంపా బాబురావు, కుమారులు మజ్జిగ అందజేశారు. ఈ సందర్భంగా ట్రస్ట్ చైర్మన్ బాబూరావు మాట్లాడుతూ గత కొన్నేళ్లుగా వేసవిలో మజ్జిగ, మంచినీటిని పాదచారులకు అందుబాటులో ఉంచుతున్నట్లు తెలిపారు. గంపా శ్రీనివాసయాదవ్, కందుల లీలా కృష్ణ, అరేపల్లి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

అశ్రునయనాలతో కిషోర్ అంత్యక్రియలు



అవనిగడ్డ: హైదరాబాద్‌లో గుండెపోటుతో మరణించిన సీఐఎస్ఎఫ్ జవాన్ విశ్వనాధుని యువకిశోర్ (36) అంత్యక్రియలను మండల పరిధిలోని అశ్వరావుపాలెంలో సోమవారం అశ్రునయనాలతో నిర్వహించారు. ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు, జెడ్పీటీసీ చింతలపూడి లక్ష్మీనారాయణ యువకిశోర్ భౌతిక కాయాన్ని సందర్శించి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతిని తెలిపారు. ఈ సందర్భంగా సీఐఎస్ఎఫ్ సీఐ, ఎస్ఐతో పాటు పలువురు సిబ్బంది హైదరాబాద్ నుంచి తరలి రాగా అధికార లాంఛనాలతో అంత్యక్రియలు నిర్వహించారు.

ఐటీఐ అడ్మిషన్ల ప్రక్రియ ప్రారంభం

మొగల్రాజపురం(విజయవాడతూర్పు): జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేటు ఐటీఐ కళాశాలల్లో చేరేందుకు అడ్మిషన్ల ప్రక్రియను చేపట్టామని ప్రభుత్వ ఐటీఐ కళాశాల ప్రిన్సిపాల్ ఎం.కనకారావు ఒక ప్రకటనలో తెలిపారు. పదో తరగతి ఉత్తీర్ణులైన వారు జూన్ 6వ తేదీ లోపుగా ఐటీఐ.ఏపీ.జీవో.ఇన్ వెబ్‌సైట్ ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు కౌన్సెలింగ్ నిర్వహించి సీట్లు కేటాయిస్తామని పేర్కొన్నారు.

మురుగునీటి కేంద్రాలుగా ఖాళీ స్థలాలు

- విజృంభిస్తున్న దోమలు
- 15 రోజుల్లో మెరక చేయాలని అధికారులు ఆదేశం

పెనమలూరు: తాడిగడప మునిసిపాలిటీ పరిధిలో ఖాళీ ఇళ్ల స్థలాలు పెద్ద సమస్యగా మారాయి. స్థలాల యజమానులు కొనుగోలు చేసిన తరువాత మెరక చేయకుండా వదిలేయంటతో మురుగునీరు చేరి ఖాళీ స్థలాలు దోమల ఉత్పత్తి కేంద్రాలుగా మారాయి. తాడిగడప మునిసిపాలిటీ పరిధిలో కానూరు, యనమలకుదురు, పోరంకి ప్రాంతాల్లో ఖాళీ స్థలాలు సమస్యాత్మకంగా మారాయి. ఈ ప్రాంతంలో చాలా కాలం క్రితం ఇళ్ల స్థలాలు కొనుగోలు చేసిన యజమానులు స్థలాలను మెరక చేయకుండా వదిలేశారు. దీంతో ఖాళీ స్థలంలో మురుగునీరు చేరి చెరువులుగా తలపిస్తున్నాయి. ఖాళీ స్థలాల్లో పిచ్చి మొక్కలు కూడా విపరీతంగా పెరిగి విష కీటకాలకు, దోమలకు ఆవాసాలుగా మారాయి. డ్రైనేజీ నీరు ఖాళీ స్థలాల్లోకి చేరి పరిస్థితులు దారుణంగా మారాయి. మురుగునీరు నిలిచి పోవటంతో దోమలు విపరీతంగా పెరిగి రాత్రి సమయాల్లో ప్రజలకు కంటిమీద కునుకు లేకుండా చేశాయి. గతంలో గ్రామ పంచాయతీలుగా ఉన్న కాలంలో ఖాళీ స్థలాల యజమానులకు నోటీసులు ఇచ్చినా, హెచ్చరికలు చేసినా వారు స్పందించక పోవటంతో ఇప్పుడు పరిస్థితులు దారుణంగా మారాయి.



కానూరులో నివాసాల మధ్య ఖాళీ స్థలాల్లో నిలిచి ఉన్న మురుగునీరు

15 రోజుల్లో ఖాళీ స్థలాలు మెరక చేయాలి...

కానూరు, యనమలకుదురు, పోరంకి ప్రాంతాల్లో ఉన్న ఖాళీ స్థలాలను యజమానులు 15 రోజుల్లో మెరక చేయాలని మునిసిపాలిటీ అధికారులు తెలుపుతున్నారు. ఖాళీ స్థలాల్లో మురుగునీరు ,పిచ్చి మొక్కలు ఉండటం వలన నివాసితులు చాలా ఇబ్బంది పడుతున్నారని అన్నారు. దీనిపై అనేక ఫిర్యాదులు అందుతున్నాయని తెలిపారు. ఖాళీ స్థల యజమానులు స్థలాలు మెరక చేసి వేకెంట్ ల్యాండ్ టాక్స్ చెల్లించాల్సి ఉంది. దీనిపై స్థలాల యజమానులు స్పందించక పోతే అపరాధ రుసుం వేస్తామని అధికారులు హెచ్చరిస్తున్నారు

మునిసిపాలిటీ అనుమతి లేకుండా వీధులకు పేర్లు పెట్టవద్దు

తాడిగడప మునిసిపాలిటీ పరిధిలో వీధుల పేర్లు ఎవరికి వారు ఇష్టానుసారంగా పెడుతున్నారని ఇక మీదట అలా పేర్లు పెడితే చర్యలు తీసుకుంటామని మునిసిపల్ అధికారులు తెలిపారు. వీధుల పేర్లు పెట్టాలంటే ముందుగా తాడిగడప మునిసిపాలిటీకి దరఖాస్తు చేయాలని, మునిసిపాలిటీలో తీర్మానం చేసి, అనుమతులు ఇచ్చిన తరువాతే వీధుల పేర్లు పెట్టాలని కమిషనర్ ఎన్.ప్రకాశరావు తెలిపారు. ముందస్తు అనుమతులు లేకుండా వీధుల పేర్లతో ఏర్పాటు చేసిన బోర్డులు తొలగిస్తామన్నారు.

తాగునీటి సమస్య పరిష్కారానికి చర్యలు

మండల సర్వసభ్య సమావేశంలో ఎంపీపీ

రామవరప్పాడు: తాగునీటి సమస్య పరిష్కారానికి అవసరమైన చర్యలు చేపడుతున్నట్లు ఎంపీపీ చెన్ను ప్రసన్నకుమారి తెలిపారు. మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం సర్వ సభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పలు శాఖల అధికారులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, పంచాయతీ కార్యదర్శులతో సమీక్షించారు. మండలంలోని పలు గ్రామాల్లో నెలకొన్న సమస్యలను సమావేశం దృష్టికి తీసుకొచ్చారు. చెన్ను ప్రసన్న కుమారి మాట్లాడుతూ ఈ వేసవిలో గ్రామాల వారీగా తాగునీటి సమస్యలు పరిష్కరిస్తున్నామని, అవసరమైన గ్రామాల్లో మంచినీటి బోర్ల సౌకర్యం కల్పిస్తున్నట్లు తెలిపారు. ప్రాధాన్యత క్రమంలో అభివృద్ధి పనులు నిర్వహిస్తున్నామన్నారు. ఇటీవల కురిసిన వర్షాలకు దెబ్బతిన్న పంటల వివరాలపై సమీక్ష నిర్వహించారు. రైతులు ఇబ్బందులు ఎదుర్కొనకుండా మిల్లర్లు ధాన్యం కొనుగోలు చేసే విధంగా అధికారులు పర్యవేక్షిం చాలన్నారు. పలు అంశాలను ఆమోదించారు. ఎంపీడీవో బి.ఎల్.వి శేషగిరి రావు, వైస్ ఎంపీపీ వేమూరి సురేష్, జెడ్పీటీసీ సువర్ణ రాజు, పలు గ్రామాల సర్పంచ్‌లు, మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.



మండల సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ చెన్ను ప్రసన్న కుమారి

20న మండల సర్వసభ్య సమావేశం

గన్నవరం: స్థానిక మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో ఈ నెల 20వ తేదీ సాయంత్రం 3 గంటలకు సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు ఇన్‌ఛార్జ్ ఎంపీడీవో కె.వెంకటేశ్వరరావు సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఎంపీపీ అనగాని రవి అధ్యక్షతన ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలు తీరు, అభివృద్ధి కార్యక్రమాలపై చర్చించనున్నట్లు పేర్కొన్నారు. మండలంలోని ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు, ఇతర ప్రజాప్రతినిధులు, అధికారులు హాజరు కావాలని కోరారు.

ప్రణాళికాబద్ధంగా సమస్యలు పరిష్కరించాలి

ఉంగుటూరు: 'జగనన్నకి చెబుదాం'లో వచ్చిన సమస్యలను సత్వరమే పరిష్కరించేందుకు ఆయా శాఖల అధికారులు కృషి చేయాలని ఎంపీడీవో జీఎస్వీ శేషగిరిరావు అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో పలు సంక్షేమ పథకాలపై సోమవారం సమీక్ష నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ మిషన్ వాత్సల్య పథకం నిరంతరం పర్యవేక్షణ జరుగుతోందని, ఏ నెలకు ఆ నెలలో దరఖాస్తులు తీసుకోవచ్చని తెలిపారు. బేస్మెంట్ వేయని లబ్ధిదారులు త్వరితగతిన పూర్తి చేసేవిధంగా చైతన్యపరచాలని సూచించారు. పొదుపు సంఘాల నుంచి రూ.35 నుంచి 50 వేలు గృహ నిర్మాణాలకు అందజేయాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఈవోపీఆర్‌డీ బాషా, హౌసింగ్ ఏఈ సురేష్ పాల్గొన్నారు.

పుస్తక పఠనం అలవర్చుకోవాలి



తెన్నేరు శాఖా గ్రంథాలయంలో శ్లోకాలు రాస్తున్న విద్యార్థులు



ఉయ్యూరు గ్రంథాలయంలో నీతి కథలు బోధిస్తున్న సంగీతం బోధకురాలు మాధవి

కంకిపాడు: పుస్తక పఠనం అలవర్చుకోవాలని వక్తలు సూచించారు. మండలంలోని తెన్నేరు, కంకిపాడు శాఖా గ్రంథాలయాల్లో వేసవి శిక్షణ శిబిరాలు ఉత్సాహంగా సాగుతున్నాయి. అందులో భాగంగా సోమవారం కథలు చెప్పటం, శ్లోకాలు రాయటం, సొంతగా కథలు రాయటంపై శిక్షణ ఇచ్చారు. చెస్, క్యారమ్స్, నృత్యంలో కూడా విద్యార్థులు శిక్షణ పొందుతున్నారు. ఆసక్తికరమైన కథలను పిల్లలు తోటి విద్యార్థులకు వినిపించారు. కంకిపాడు, తెన్నేరు శాఖా గ్రంథాలయాధికారులు సీహెచ్ రామకృష్ణ, ఎస్.సునీత శిక్షణ కార్యక్రమాలను పర్యవేక్షించారు.

కొనసాగుతున్న వేసవి శిక్షణ తరగతులు

ఉయ్యూరు: గ్రంథాలయాల్లో వేసవి శిక్షణ తరగతులు కొనసాగుతున్నాయి. విద్యార్థులు గ్రంథాలయాలకు వెళ్లి వివిధ అంశాలపై శిక్షణ పొందుతున్నారు. ఉయ్యూరు గ్రంథాలయంలో సోమవారం నీతి కథలు, వేమన పద్యాలు, సంగీతంపై శిక్షణ ఇచ్చారు. సంగీతం బోధకురాలు మాధవి చిన్నారులకు శిక్షణ ఇచ్చారు. గ్రంథాలయాధికారి రమణి, బి.డి.సి. సోని పర్యవేక్షించారు. కాటూరు గ్రంథాలయంలో విద్యార్థులు వేసవి శిక్షణ తరగతుల్లో పాల్గొన్నారు.

గన్నవరం రూరల్: పురుషోత్తపట్నంలో గ్రంథాలయంలో వేసవి శిక్షణలో భాగంగా జీఎంఎస్‌కే జె.జాగృతి విద్యార్థులకు గుడ్ టచ్, బ్యాడ్ టచ్‌పై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో లైబ్రేరియన్ కె.కృపానందం, పాఠకులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

ముస్తాబాద శాఖా గ్రంథాలయంలో లైబ్రేరియన్ కె.జ్యోతికుమారి ఆధ్వర్యంలో విద్యార్థులకు చెస్, క్యారమ్స్, నీతి కథలు పోటీలు జరిగాయి.

భానుడి ప్రతాపంతో బెంబేలు

మచిలీపట్నంటౌన్: భానుడి తాపంతో జనం బెంబేలెత్తుతున్నారు. నగరంలో సోమవారం 43 డిగ్రీల అధిక ఉష్ణోగ్రత నమోదైంది. దీనికి తోడు వడగాలులు, ఉక్కపోతతో ప్రజలు తల్లడిల్లారు. ఉదయం నుంచే భానుడు ప్రతాపం చూపటంతో ప్రజలు సాయంత్రం వరకు ఇళ్లకే పరిమితమయ్యారు. అధిక వేడిమితో బయటప్రాంతం నిప్పుల కొలిమిగా మారింది. దీంతో ప్రజలు బయట సంచరించేందుకు భయపడ్డారు. నగరంలోని ప్రధాన రహదారులు సైతం నిర్మానుష్యంగా మారాయి. దుకాణదారులు వ్యాపారాలు లేక మూసివేశారు. వేసవి తాపాన్ని తీర్చుకునేందుకు ప్రజలు శీతలపానీయాలు, కొబ్బరినీళ్లను సేవించారు.

అవనిగడ్డ: దివిసీమలో సోమవారం ఎండలు మండిపోయాయి. ఉదయం 8 గంటల నుంచే వడగాలులు ప్రారంభం కాగా రాత్రి 7 గంటల వరకూ కొనసాగాయి. దివిసీమలోని పలు ప్రాంతాల్లో సోమవారం 42 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. భానుడు తీవ్ర ప్రతాపం చూపించడంతో ద్విచక్ర వాహనదారులు, పాదచారులు బెంబేలెత్తిపోయారు. అత్యవసరమైన పనుంటే తప్ప బయటకు రావాలంటే భయపడిపోయారు. పులిగడ్డ వద్ద 216 జాతీయ రహదారిపై వాహనాల రాకపోకలు కరువడంతో నిర్మానుష్యంగా మారింది. కొంతమంది వడదెబ్బ తగిలి ఆస్పత్రుల పాలయ్యారు. వడగాలులు పెరిగినందున జాగ్రత్తలు పాటించాలని స్థానిక ప్రభుత్వ ఏరియా వైద్యశాల సూపరింటెండెంట్ నాగార్జున సూచించారు.

కోడూరు: భానుడి భగభగలకు మండల ప్రజలు అల్లాడిపోయారు. సోమవారం ఉదయం 7 గంటల నుంచే సూర్యుడు తన ప్రతాపాన్ని చూపడంతో ప్రజలు బెంబెలెత్తిపోయారు. ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు తీవ్రమైన వడగాల్పులు వీయడంతో ప్రజలు ఇళ్లల్లో సైతం ఉండలేని పరిస్థితి. కోడూరులో అత్యాధికంగా 44.78 ఉష్ణోగ్రత నమోదైయినట్లు తహసీల్దార్ షేక్ లతీఫ్‌పాషా చెప్పారు. వడగాల్పుల ప్రభావం రాత్రి వరకు కొనసాగుతూనే ఉంది. ఎండ ప్రభావంతో రహదారులు మొత్తం నిర్మానుష్యంగా దర్శనమిచ్చాయి. వృద్ధులు, చిన్నారులు, దివ్యాంగులు ఎండ తీవ్రతకు అల్లాడిపోయారు. మరో రెండు రోజుల పాటు ఎండ తీవ్రత కొనసాగుతుందని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని మండల అధికారులు సూచించారు.



నిర్మానుష్యంగా మారిన బందరు ప్రధాన రహదారి



పులిగడ్డ వద్ద నిర్మానుష్యంగా ఉన్న 216 జాతీయ రహదారి

పోర్టు ఆహ్వాన పత్రికల పంపిణీ ప్రారంభం

మచిలీపట్నంటౌన్: ఈ నెల 22వ తేదీన రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బందరు పోర్టు పనుల ప్రారంభానికి విచ్చేస్తున్న నేపథ్యంలో ఈ కార్యక్రమానికి హాజరై జయప్రదం చేయాలని కోరుతూ వైఎస్సార్ సీపీ శ్రేణులు నగరంలోని పలు డివిజన్లలో సోమవారం ఇంటింటికి వెళ్లి ఆహ్వానపత్రికలు అందజేశారు. మూడో డివిజన్‌లో కార్పొరేటర్ శీలం భారతి, మాజీ కౌన్సిలర్ శీలం బాబ్జి, 37వ డివిజన్‌లో కార్పొరేటర్ ఐనం తాతారావు, పార్టీ కార్యకర్తలు ఆహ్వానపత్రికలు అందించారు. వైఎస్సార్ సీపీ నగర కన్వీనర్లు గూడవల్లి నాగరాజు, శీలం బాబ్జి, చిటికిన నాగేశ్వరరావు పాల్గొన్నారు.

అర్హులందరి సంక్షేమమే లక్ష్యంగా పాలన

ఎమ్మెల్యే కొలుసు పార్థసారథి

కంకిపాడు: అర్హులందరికీ సంక్షేమమే లక్ష్యంగా ప్రభుత్వం పాలన సాగిస్తోందని ఎమ్మెల్యే కొలుసు పార్థసారథి అన్నారు. మండలంలోని మద్దూరు గ్రామంలో సోమవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఎమ్మెల్యే పార్థసారథి ఇంటింటికీ వెళ్లి ప్రజా సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలను వివరించి ప్రభుత్వ పాలనపై ప్రజాభిప్రాయాన్ని సేకరించారు. ఆయా కుటుంబాలకు చేకూరిన లబ్ధితో రూపొందించిన సంక్షేమ బ్రోచర్లను అందించారు. దుర్గాపురం ప్రధాన రహదారి, మద్దూరు గ్రామానికి వచ్చే ప్రధాన రహదారుల అభివృద్ధిపై ప్రజలు ఎమ్మెల్యేకి వినతిపత్రాలు అందించారు. ఆయన స్పందిస్తూ ప్రధాన రహదారుల అభివృద్ధి, గ్రామంలో మౌలిక వసతుల కల్పనకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామన్నారు. మద్దూరు గ్రామంలో సంక్షేమ పథకాల రూపంలో రూ.19.91 కోట్లు వెచ్చించామన్నారు.

ప్రతిపక్షాలు, ఎల్లోమీడియా ప్రచారాలను తిప్పికొట్టాలి

ప్రజారంజక పాలన సాగిస్తున్న ప్రభుత్వంపై ప్రతిపక్షాలు విషం చిమ్ముతున్నాయని ఎమ్మెల్యే పార్థసారథి ఆరోపించారు. ప్రజాదరణ చూసి ఓర్వలేక నీచ రాజకీయాలకు తెర తీస్తున్నాయని మండిపడ్డారు. ప్రతిపక్షాలు, ఎల్లో మీడియా కుట్రలను తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సర్పంచ్ చిప్పల రామదాసు, ఎంపీపీ నెరుసు రాజ్యలక్ష్మి, జెడ్పీటీసీ సభ్యుడు బాకీ బాబు, ఏఎంసీ చైర్మన్ మద్దాలి రామచంద్రరావు, అగ్రి బోర్డు చైర్మన్ చాట్ల విజయ్‌బాబు, ఎంపీటీసీ ఒడుగు శ్రీనివాసరావు, వైఎస్సార్ సీపీ నాయకులు ఒడుగు ఆంజనేయులు, పోతాబత్తిన నాగార్జున, పి.రవి, అరవపల్లి మోహన్‌రావు, ఏసురత్నం, సునీల్ తదితరులు పాల్గొన్నారు.



మద్దూరులో ప్రభుత్వ సంక్షేమ పాలన వివరిస్తున్న ఎమ్మెల్యే పార్థసారథి

విద్యార్థులు పర్యావరణాన్ని పరిరక్షించాలి

ఫారెస్టు రేంజ్ అధికారి సుజాత


పెనమలూరు: విద్యార్థులతో పాటు ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి పర్యావరణాన్ని పరిరక్షించాలని జిల్లా ఫారెస్టు రేంజ్ ఆఫీసర్ సుజాత అన్నారు. కానూరు వీఆర్ సిద్ధార్థ ఇంజినీరింగ్ కాలేజీలో ఎన్ఎస్ఎస్ ఫారెస్టు డిపార్టుమెంట్ ఆధ్వర్యంలో మిషన్ లైఫ్- లైఫ్ ఫర్ ఎన్విరాన్‌మెంట్ కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా ఫారెస్టు రేంజ్ ఆఫీసర్ సుజాత మాట్లాడుతూ ప్రతి విద్యార్థి వారి ఇంట్లో మొక్కలు పెంచాలన్నారు. ఇంటి పక్కన ఉండే వారికి కూడా మొక్కల పెంపకం, పర్యావరణంపై అవగాహన కల్పించాలని సూచించారు. మొక్కలు పెంచటం వలన ఉష్ణోగ్రతలు తగ్గించవచ్చని వివరించారు. ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించాలని, పాడి చెత్తను తగులబెట్టి కాలుష్యాన్ని పెంచవద్దని అన్నారు. అనంతరం విద్యార్థులతో పర్యావరణ పరిరక్షణకు ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ కొల్లా నరేంద్ర, శ్రీవల్లి పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత

కంకిపాడు: పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత అని ఐసీడీఎస్ కంకిపాడు ప్రాజెక్టు సీడీపీఓ కె.బి.సుకన్య అన్నారు. పట్టణంలోని అంగన్‌వాడీ కేంద్రం -07లో మిషన్‌లైఫ్ కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. పర్యావరణ పరిరక్షణ, నీటి సంరక్షణపై అవగాహన కల్పిస్తూ పట్టణంలో ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన సమావేశంలో సీడీపీఓ కె.బి.సుకన్య మాట్లాడుతూ నీటిని వృథా చేయరాదన్నారు. వర్షపునీటి నిల్వకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలన్నారు. ప్లాస్టిక్ వినియోగం తగ్గించాలని, నిమ్మ, తులసి, అశ్వగంధ, ఆకుకూరలు, మొక్కల ప్రాముఖ్యతను గురించి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ అన్నామణి, టీచర్లు వై.నళినీకుమారి, డి.లక్ష్మి, కె.భవాని, కిశోర బాలికలు పాల్గొన్నారు.

దాసాంజనేయ స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు

హనుమాన్‌జంక్షన్ రూరల్: స్థానిక నూజివీడు రోడ్డులోని 45 అడుగుల ఎత్తైన దాసాంజనేయస్వామి విగ్రహం వద్ద హనుమజ్జయంతి ఉత్సవాల్లో భాగంగా సోమవారం ప్రత్యేక పూజలు చేశారు. ఆలయంలో ఉదయం 7 గంటల నుంచి రాత్రి 7 గంటల వరకు ఏకధాటిగా 12 గంటల పాటు 'హరేరామ హరేకృష్ణ' ఏకనామం పారాయణం జరిగింది. వేలేరు, తాళ్లమూడి గ్రామాలకు చెందిన భజన మండలి సభ్యులు ఏకనామ పారాయణం చేశారు. ఈ సందర్భంగా ఆలయాన్ని, 45 అడుగుల ఎత్తైన హనుమాన్ విగ్రహాన్ని విద్యుద్దీపాలతో అలంకరించారు. దాసాంజనేయస్వామిని మూడు రోజుల పాటు సీతారామపురం, ఏపూరు, బాపులపాడు, కృష్ణనగర్‌లో గ్రామసేవ నిర్వహించనున్నట్లు ఆలయ ధర్మకర్తలైన పల్నాటి సత్యనారాయణ, చోడే వెంకయ్య కుటుంబ సభ్యులు తెలిపారు. 17వ తేదీ మధ్యాహ్నం ఆలయ ప్రాంగణంలో అన్నసమారాధన జరుగుతుందని చెప్పారు.



విద్యుద్దీపాల అలంకరణలో దాసాంజనేయ స్వామి ఆలయం

సమస్యలను సాధ్యమైనంత త్వరగా పరిష్కరించాలి

జిల్లా అధికారులతో మంత్రి జోగి రమేష్

పెడన: ప్రజా సమస్యలను సాధ్యమైనంత త్వరగా పరిష్కరించాలని రాష్ట్ర గృహ నిర్మాణ శాఖమంత్రి జోగి రమేష్ అన్నారు. వ్యవసాయ మార్కెట్ కమిటీ హాల్లో నియోజకవర్గంలోని సమస్యలపై కలెక్టర్ రాజబాబుతో కలిసి వివిధ శాఖల అధికారులతో సోమవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. మంత్రి మాట్లాడుతూ ఎసైన్డ్ భూముల్లో ప్రస్తుతం ఎవరైతే అనుభవదారులు ఉన్నారో వారికి పట్టా ఇచ్చేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. కృష్ణా యూనివర్సిటీకి కేటాయించిన స్థలానికి సంబంధించి నెలకొన్న సమస్యను పరిష్కరించాలని కోరారు. తీర ప్రాంతంలో తాగునీటి సమస్య ఉత్పన్నమవుతుందని, ఫిల్టర్ బెడ్‌లు మరమ్మతులకు గురైనట్లు తెలిపారు. పలు ప్రాంతాల్లో లో వోల్టేజ్ సమస్య నెలకొందని మంత్రి అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. పట్టణంలోని జగనన్న లే ఆవుట్లలో అంతర్గత రహదారులకు రూ.1.75 కోట్లు సరిపోవని, పెద్ద కాలనీలు కావడం వల్ల క్షేత్రస్థాయిలో పరిశీలించి నిధులు పెంచాలని సూచించారు. ఆక్వా రైతులకు సబ్సిడీపై విద్యుత్ పూర్తిగా అందడం లేదని పేర్కొన్నారు. పూర్తిస్థాయిలో విద్యుత్‌ను సరఫరా చేయాల్సిందిగా కోరారు. పలు మండలాల్లో సొంత ఇంటి కోసం దరఖాస్తు చేసుకున్నారని, వారి కోసం ఇళ్ల స్థలాలు మంజూరు చేయాల్సి ఉందన్నారు. ఆయా సమస్యలను మళ్లీ రెండు నెలలు తరువాత ఏర్పాటు చేసుకునే సమావేశంలో చర్చకు రాకుండా చూడాలని కోరారు. బాధ్యతగా ఆయా సమస్యలను పరిష్కరించి ప్రజల మన్ననలను పొందేలా నడుచుకుందామని ఆకాంక్షించారు. కలెక్టర్ రాజాబాబు మాట్లాడుతూ మొట్టమొదటి సారిగా పెడన నియోజకవర్గానికి వచ్చానని తెలిపారు. ఈ ప్రాంతంలో ఏయే సమస్యలున్నాయో మంత్రి సంబంధిత శాఖాధికారుల దృష్టికి తీసుకురావడం జరిగిందన్నారు. డివిజన్, జిల్లా స్థాయిలో సమస్యలుంటే తన దృష్టికి వెంటనే తీసుకురావాలని చెప్పారు. వాటిని పరిష్కరించడానికి ఉన్న అవకాశాలను పరిశీలించి తక్షణ చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ అపరాజిత సింగ్, మచిలీపట్నం ఆర్డీవో కిషోర్, పెడన నియోజకవర్గంలోని ప్రజాప్రతినిధులు బళ్ల జ్యోత్స్నరాణి, చిన బాబు, రత్నకుమారి, వెంకటరమణ, చారుమతి జిల్లా, డివిజన్, మండల అధికారులు పాల్గొన్నారు. సమావేశం అనంతరం మొదటి సారిగా పెడన నియోజకవర్గానికి విచ్చేసిన జిల్లా కలెక్టర్ రాజబాబును మంత్రి జోగి రమేష్ సత్కరించి పెడన కలంకారీ జ్ఞాపికను అందజేశారు. అలాగే జేసీ అపరాజిత సింగ్‌కు మహిళా ప్రజాప్రతినిధులు చారుమతి, జ్యోత్స్న వెంకటరమణ, రత్నకుమారి సత్కరించి జ్ఞాపికను అందజేశారు.



మాట్లాడుతున్న మంత్రి జోగి రమేష్, పక్కన జిల్లా కలెక్టర్ రాజాబాబు, జేసీ అపరాజిత సింగ్

హజ్ యాత్రికులకు సీఎం జగన్ ఆర్థిక సాయంపై హర్షం

భవానీపురం(విజయవాడపశ్చిమ): హజ్ యాత్రకు వెళ్లే ముస్లింలకు ఊరట కలిగేలా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం నిధులు విడుదల చేస్తూ ఉత్తర్వులు జారీ చేయడంపై ఎన్టీఆర్ జిల్లా వక్ఫ్‌బోర్డ్ అధ్యక్షుడు గౌస్ మొహిద్దీన్ సోమవారం ఒక ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. హైదరాబాద్, బెంగళూరు ఎంబార్కేషన్ పాయింట్ టికెట్ ధరలతో సమానంగా విజయవాడ ఎంబార్కేషన్ పాయింట్ టికెట్ ధరలు ఖరారు చేయడం, అందుకు సంబంధించి అన్ని వసతులు కల్పించటం హజ్ యాత్రికులకు భారీ ఊరట కలిగించిందన్నారు.

26 నుంచి రైతు సంఘాల సమన్వయ సమితి నిరసన

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): సంయుక్త కిసాన్ మోర్చా పిలుపు మేరకు బీజేపీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వ మోసపూరిత హామీలకు నిరసనగా రాష్ట్ర వ్యాప్తంగా ఈ నెల 26 నుంచి 30వ తేదీ వరకు ప్రదర్శనలు, ధర్నాలు నిర్వహించడంతోపాటు పార్లమెంటు సభ్యులకు వినతి పత్రాలు అందించాలని ఆంధ్రప్రదేశ్ రైతుసంఘాల సమన్వయ సమితి తీర్మానించింది. ఆంధ్రప్రదేశ్ రైతుసంఘాల సమన్వయ సమితి సమావేశం విజయవాడ ప్రెస్ క్లబ్‌లో కన్వీనర్ వడ్డే శోభనాద్రీశ్వరరావు అధ్యక్షతన సోమవారం జరిగింది. సంయుక్త కిసాన్ మోర్చా పిలుపు మేరకు దేశవ్యాప్తంగా జరుగుతున్న ఆందోళనలో భాగంగా రాష్ట్రంలో విజయవంతం చేయాలని వడ్డే పిలుపునిచ్చారు.